ఈనాడు
మహబూబాబాద్
గురువారం అక్టోబరు 10, 2024

సద్దుల బతుకమ్మకు సన్నద్ధం

మహబూబాబాద్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మైదానం సద్దుల బతుకమ్మ వేడుకకు సిద్ధమైంది. పురపాలక సంఘం ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారుల సమన్వయంతో సద్దుల బతుకమ్మ వేడుక నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టారు. ఎన్టీఆర్ మైదానంలో బతుకమ్మ ఆటలు ఆడి సమీపంలోని నిజాంచెరువులో వాటిని నిమజ్జనం చేసేందుకు భారీబందోబస్తు ఏర్పాటు చేశారు. దారి పొడవున, మైదానం నలుమూలల విదుత్తు దీపాలను అమర్చారు. కొత్త బజార్‌లోని బంధం చెరువు వద్ద కూడా నిమజ్జనానికి సౌకర్యాలు కల్పించారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల కోసం ప్రత్యేక వేదికను సిద్ధం చేశారు.



సరస్వతీ నమస్తుభ్యం

దేవీశరన్నవ రాత్రి మహోత్సవాలు రంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. డోర్నకల్ వాయుసేన యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమ్మవారి మండపంలో బుధవారం సరస్వతీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. అమ్మవారి వద్ద చిన్నారులు అక్షరాభ్యాస పూజ నిర్వహించారు. చదువులమ్మ తల్లి.. ఉన్నత శిఖరాలకు చేర్చాలంటూ వేడుకున్నారు. తల్లిదండ్రులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, డోర్నకల్

జగమేలుతోంది.. మన బతుకమ్మ

'ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ..
ఏమేమి కాయప్పునే గౌరమ్మ..
చిత్తూ చిత్తుల బొమ్మ.. శివుడి ముద్దుల గుమ్మ..
ఒక్కోసి పువ్వేసి సందమామ.. బతుకమ్మ బతుకమ్మ
ఉయ్యాలో.. మమ్మేలు కోవమ్మ ఉయ్యాలో..
అంటూ ఓరుగల్లువ్యాప్తంగా బతుకమ్మ పాటలు మారుమోగుతున్నాయి..

నేడు సద్దుల బతుకమ్మ

ఎన్నో ప్రత్యేకతలు.. సంప్రదాయాల మేళవింపు

ఈనాడు, జయశంకర్ భూపాలపల్లి, న్యూస్‌టుడే, నర్సంపేట, దేవరుప్పుల(జనగామ)

ఇంద్రధనస్సులోని వర్ణాలు కలిగిన తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మ నేడు జగమేలుతోంది.. తెలంగాణ సంస్కృతికి పూల పండగ నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది.. మన సంప్రదాయాన్ని విదేశాల్లోనూ వ్యాప్తి చేస్తున్నారు.అక్కడ స్థిరపడ్డ మనవాళ్లు అంగరంగ వైభవంగా జరుపుకొంటున్నారు..ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురువారం సద్దుల బతుకమ్మ పండగను నిర్వహించనున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం..



16 ఏళ్లుగా ఒక్కో అడుగు పెంచుతూ..

నర్సంపేటకు చెందిన రుద్రారపు సరోజన-పైడయ్య దంపతులు తొమ్మిది రకాల పూలతో ఏటా ఒక అడుగు పెంచుతూ పెద్ద బతుకమ్మను పేరుస్తున్నారు. 16 ఏళ్ల కిందట తొలిసారి 3 అడుగుల ఎత్తుతో బతుకమ్మను పేర్చారు. అప్పటి నుంచి ఏటా ఒక్కో అడుగు ఎత్తు పెంచుతూ వస్తున్నారు. ఈసారి 12 అడుగుల ఎత్తుతో బతుకమ్మను పేర్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వారం రోజులుగా పలువురు కూలీలతో పెట్టి కొత్తగూడ, గంగారం, పాకాల అడవుల్లో గునుగు, తంగేడు, టేకు, అల్లీ పూలు, తామర, సీతజడ, బంతి, చామంతి వంటి 9 రకాల పూలను సేకరిస్తున్నారు. ఇంట్లో మహిళా కూలీలతో వాటిని కట్టలు కట్టిస్తున్నారు. ప్రత్యేకం ట్రాలీలో బతుకమ్మను మైదానానికి భాజాభజంత్రీల నడుమ తీసుకొస్తారు.



కర్ణాటకవాసులకు మక్కువ..

బతుకమ్మ పండగను కన్నడ ప్రజలు బాగా ఇష్టపడుతున్నారు. కర్ణాటకలోని హసన్ జిల్లా హళబిడ గ్రామానికి చెందిన అయ్యంగార్ యమున-రాజు దంపతులు పదేళ్ల కిందట నర్సంపేటకు వచ్చి బేకరీ నడుపుతున్నారు. ఇక్కడి ప్రజలు పూలను ఆరాధించే సంస్కృతి వారికి బాగా నచ్చింది. సొంతంగా బతుకమ్మ పేర్చి ఇక్కడి మహిళలతో కలిసి ఆడుతున్నారు.

సీతంపేటలో దీపావళికి వేడుకలు.. పురుషులూ ఆడుతారు..

భీమారం, న్యూస్‌టుడే: హసన్‌పర్తి మండలం సీతంపేటలో నేతకాని కులస్థులు దీపావళి పండగ సమయంలో బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తారు. గ్రామస్థులు తరతరాలుగా ఈ సంప్రదాయం కొనసాగిస్తున్నారు. దీపావళి రోజున పుట్టమన్ను తీసుకొచ్చి ఇళ్లలో జోడెడ్ల ప్రతిమలను తయారు చేసి పూజిస్తారు. మరుసటి రోజున కేధారేశ్వర వ్రతం చేస్తారు. జోడెడ్లను అలంకరించి ఊరేగిస్తారు. తర్వాత చెరువులో నిమజ్జనం చేస్తారు. మరుసటి రోజున సద్దుల బతుకమ్మను నిర్వహిస్తారు. మహిళలతో పాటు, పురుషులు కూడా బతుకమ్మ ఆడుతారు.





విదేశాల్లోనూ సందడే..

ఒకప్పుడు తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లోనే సందడి చేసిన బతుకమ్మ పండగ నేడు విశ్వవ్యాప్తమైంది. యూకేలోని వారిక్ పట్టణంలో జరిగే వేడుకలు ఉత్తరాది దక్షిణాది సంస్కృతుల మేళవింపుగా సాగుతున్నాయని తెలుగు ఆడపడుచు, అక్కడి కౌన్సిలర్ ఎల్లాప్రగడ హేమ తెలిపారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకోవడం విదేశీ మహిళలు ఆసక్తిగా గమనించి.. తమతో కలిసి వస్తున్నారని తెలుగు మహిళలు చెబుతున్నారు.



టోక్యో నగరంలో..

ముందస్తు అనుమతి తీసుకుంటాం..



- తాటిపాటి పల్లవీ-సాగర్, కోటోకు ఓజీమా వీధి, టోక్యో (దేవరుప్పుల మండలం సీతారాంపురం)

మా వీధిలో 60 వరకు తెలుగు కుటుంబాలున్నాయి. బతుకమ్మ పండగను అందరం కలిసి జరుపుకొంటాం. సామూహికంగా నిర్వహించాలి కాబట్టి అధికారుల ముందస్తు అనుమతి తీసుకుంటాం. గడ్డిపూలు, వివిధ రాకల పూలతో బతుకమ్మ పేర్చి, ఒక దగ్గర గుమిగూడి ఆటపాటలతో సందడి చేసి, వాయినాలు ఇచ్చుకుంటాం. సమీపంలోని నదిలో నిమజ్జనం చేస్తాం.

వంటకాలను ఇచ్చిపుచ్చుకుంటాం..



- పెద్దాపురం మమత, అల్బనీ, అమెరికా, (దేవరుప్పుల)

అల్బనీ ప్రాంతంలో బతుకమ్మకు ప్రత్యేకంగా పూలు తెచ్చి మార్కెట్‌లో అమ్ముతుంటారు. ఇక్కడ తెలుగు సహా ఇతర రాష్ట్రాల మహిళలు కలిసి వేడుకలు జరుపుకొంటారు. సద్దుల బతుకమ్మ నాడు వండిన వంటకాలను ఒకరికొకరం పంచుకుంటాం.

ఇంట్లోనే నిమజ్జనం..

- గాదె ఉషశ్రీ, చెక్ రిపబ్లిక్, (దేవరుప్పుల)



మేము ఉండే దగ్గర 25-30 తెలుగు కుటుంబాలున్నాయి. బతుకమ్మను ఎవరి నివాసంలో వారే నిర్వహించి, అష్టమి రోజు ఒక నీటి తొట్టి ఏర్పాటు చేసుకొని నిమజ్జనం చేస్తాం. వీలును బట్టి అందరి ఇళ్లు కలియతిరిగి శుభాకాంక్షలు చెప్పుకొంటాం.

● కెనడా రాజధాని అటవా నగరంలో వరంగల్ జిల్లాకు చెందిన పలు అనేక కుటుంబాలు స్థిరపడ్డాయి. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తికి మండలం దండేపల్లికి చెందిన సుధీర్ కోదాటి ఈ ప్రాంతంలోని తెలుగువారిని సంఘటితం చేసి గత 15 ఏళ్లుగా వేడుకలు నిర్వహిస్తున్నారు. తెలుగు అసోసియేషన్ నిర్వహించే బతుకమ్మ వేడుకలకు బంగారు నాణేలు, 500 డాలర్లు బహుమతులుగా ఇస్తున్నారు. 19 ఏళ్ల కింద అమెరికాలోని షికాగాలో స్థిరపడిన వర్ధన్నపేటకు చెందిన పూర్ణచందర్ అల్లమనేని 2003 నుంచి ఘనంగా సంబరాలు జరుపుతున్నారు.

పూల కొనుగోళ్ల సందడి



ఇందిరాగాంధీ కూడలిలో..

సద్దుల బతుకమ్మ పండగ నేపథ్యంలో బుధవారం ఉదయం నుంచే జిల్లా కేంద్రంలోని నెహ్రూసెంటర్, రైల్వేస్టేషన్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో పూల కొనుగోళ్ల సందడి నెలకొంది. తంగేడు, రంగులు కలిపిన గునుగు పూలు, చేమంతులు, సీతజడ పూలతోపాటు పలు రకాలు విక్రయించారు. జిల్లా కేంద్రవాసులే కాకుండా గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా వచ్చిన మహిళలు పెద్ద సంఖ్యలో రావడంతో రద్దీ నెలకొంది.

– న్యూస్‌టుడే, మహబూబాబాద్‌టౌన్, మానుకోట

బస్సుల్లో తరలివెళ్లిన ఉపాధ్యాయులు

మానుకోట, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024లో ఎంపికైన ఉపాధ్యాయులు బుధవారం ఉదయం జిల్లా కేంద్రం నుంచి ఆరు ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్ర రాజధానికి వెళ్లారు. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ఎంపికైన వారికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపు పత్రాలను పంపిణీ చేసేందుకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సభను ఏర్పాటు చేశారు. జిల్లాలోని 270కి పైగా వెళ్లిన ఉపాధ్యాయుల వెంట డీఈఓ రాజేశ్వర్‌తో పాటు ఎంఈఓలు, వివిధ శాఖల సిబ్బంది వెళ్లారు.



నిర్వహణ అధ్వానం...రహదారిపైకి జలం!

డోర్నకల్, న్యూస్‌టుడే: డోర్నకల్ మండలంలో ఎస్సారెస్పీ కాలువల నిర్వహణ అధ్వానంగా మారింది. కాలువల్లోకి బుధవారం నీరు వదలడంతో వాటి ప్రవాహానికి మధ్యలో చెత్త, ఏపుగా పెరిగిన పొదలు అడ్డంకిగా మారాయి. దీంతో ముందుకు ప్రవహించే మార్గం లేక జలాలు రోడ్డు పైకి వచ్చాయి. బొడ్రాయితండాలో కల్వర్టు వద్ద గండి పడింది. పలు చోట్ల మరిన్ని గండ్లు పడే ప్రమాదం పొంచి ఉండటంతో పరిసర ప్రాంతాల్లోని ఆవాసాల ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. పంచాయతీ కార్యదర్శి నాగయ్య పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఎస్సారెస్పీ అధికారులకు కాలువ పరిస్థితి గురించి స్థానికులు చరవాణి ద్వారా సమాచారం అందించారు.



బొడ్రాయితండా వద్ద రోడ్డుపై ఎస్సారెస్పీ జలాలు

అనుమతి లేకుండా నిర్వహిస్తే కఠిన చర్యలు

తొర్రూరు, న్యూస్‌టుడే: ఎలాంటి అనుమతులు లేకుండా వ్యాధినిర్ధారణ, డయాగ్నోస్టిక్ కేంద్రాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి.మురళీధర్ హెచ్చరించారు. సరైన పత్రాలు లేని తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఎల్వైఆర్ గార్డెన్‌కు వెళ్లేరోడ్డులోని మాతృశ్రీ డయాగ్నోస్టిక్ కేంద్రాన్ని బుధవారం సీజ్‌చేశారు. నిర్వాహకుడు సందీప్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ఆసుపత్రుల్లో అందిస్తున్న సేవలు, తీసుకుంటున్న రుసుం వివరాలు ఆసుపత్రిలో అందిరికీ కన్పించేలా ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.వైద్యులు సారంగం, జ్వలిత, మీరాజ్, జిల్లా డిప్యూటీ మాస్‌మీడియా అధికారి ప్రసాదు, ఆర్ఐ బషీర్, పోలీసులు పాల్గొన్నారు.



మాతృశ్రీ డయాగ్నోస్టిక్ కేంద్రాన్ని సీజ్‌చేయిస్తున్న డీఎంహెచ్‌వో మురళీధర్

వర్గీకరణ చేపట్టాకే ఉద్యోగాలు ఇవ్వాలి



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల బాధ్యులు

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: డీఎస్సీ ఉద్యోగ నియామక పత్రాలను నిలిపివేసి వెంటనే ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుప్పెల్లి అనిల్‌కుమార్‌మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ జిల్లా ఇన్‌ఛార్జి గుగ్గిళ్ల పీరయ్యమాదిగ ప్రభుత్వాన్ని కోరారు. మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల బాధ్యుల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ, చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని పట్టణంలోని అంబేడ్కర్ కూడలి నుంచి ప్రారంభించారు. ప్రధాన వీధుల గుండా ర్యాలీ కలెక్టరేట్ చేరుకుని గేటు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయంలో ఏవోకు పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనిల్‌కుమార్, పీరయ్య మాట్లాడుతూ ఆగస్టు 1వ తేదీన సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ అమలు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని తీర్పు వెలువరించిందన్నారు. వర్గీకరణ అమలు జరిగేంతవరకు ఉద్యోగ నియామకాలు పూర్తిగా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పాలేపాక ప్రవీణ్, ప్రధానకార్యదర్శి ఇరుగు రవి, ఎంఎంఎస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కత్తుల రేణుక, ఎమ్మెస్పీ జిల్లా మహిళా అధ్యక్షురాలు రజియా తదితరులున్నారు.

ఉదయ్‌చందర్ కుటుంబానికి పరామర్శ

మహబూబాబాద్, న్యూస్‌టుడే: టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్‌చందర్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ బుధవారం పరామర్శించారు. ముందుగా ఉదయ్‌చందర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. భాజపా నేతలు గడ్డం అశోక్ తదితరులున్నారు.

ఒక్కేసి.. పువ్వేసి చందమామ..!

మహబూబాబాద్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ కలెక్టరేట్‌లో బుధవారం ఎనిమిదో రోజు నిర్వహించిన బతుకమ్మ సంబురాలు మిన్నంటాయి. జిల్లా పాలనాధికారి అద్వైత్‌కుమార్ సింగ్ గౌరమ్మకు పూజ చేసి వేడుకలను ప్రారంభించారు. వివిధ శాఖలకు చెందిన మహిళా అధికారులు, ఉద్యోగులు, ఇతర సిబ్బంది 'బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..' అంటూ కోలాట నృత్యాలతో ఆడి పాడారు. అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్‌టొప్పో, ఎం.డేవిడ్, జడ్పీ సీఈవో నర్మద, జిల్లా సంక్షేమ శాఖాధికారి వరలక్ష్మి, డీఆర్‌డీవో మధుసూదన్‌రాజు, డీపీవో హరిప్రసాద్, సీడబ్ల్యూసీ అధ్యక్షురాలు డాక్టర్ ఎస్.నాగవాణి, నళినీనారాయణ, సునీత, విజయ తదితరులున్నారు.



వేడుకలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్లు ఎం.డేవిడ్, లెనిన్‌వత్సల్‌టొప్పోమహిళా ఉద్యోగులు



జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, అధికారులు

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: ఆడపిల్లల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు ప్రతి కుటుంబం సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం రాత్రి బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది బతుకమ్మలను పేర్చి తీసుకొచ్చారు.





కలెక్టరేట్‌లో బతుకమ్మ ఆడుతున్న వివిధ విభాగాల మహిళా అధికారులు, సిబ్బంది

వసూలు రాజాలపై నిఘావర్గాల ఆరా

ఈనాడు కథనానికి స్పందన

బయ్యారం, న్యూస్‌టుడే: పోడు భూముల్లో సాగునీటి వనరు కోసం బోరు వేసుకునే రైతుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వసూలు రాజాల గురించి నిఘావర్గాలు ఆరా తీస్తున్నాయి. మహబూబాబాద్, గూడూరు డివిజన్ పరిధిలోని కొన్ని అటవీశాఖ రేంజ్‌ల్లో రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ఉదంతంపై 'పోడు చుట్టూ వసూలు రాజాలు' శీర్షికన ఈనెల 8న 'ఈనాడు'లో వెలువడిన కథనానికి ఉన్నాతిధికారులు స్పందించారు. ఈ వ్యవహారంపై మన్యం ప్రాంతంలోని రైతుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అధికారులు ఎవరు అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు సమాచారం.

పోలీస్ ఔట్‌పోస్టు పునఃప్రారంభం

మహబూబాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో బుధవారం పోలీసు అవుట్ పోస్ట్ సేవలను పునఃప్రారంభించారు. డీఎస్పీ తిరుపతిరావు ఔట్ పోస్టును ప్రారంభించి మాట్లాడారు. ఆసుపత్రిలో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా సిబ్బంది పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ దేవేందర్, ఆర్ఎంవో డాక్టర్ బి.జగదీశ్వర్ పాల్గొన్నారు.



ఆసుపత్రి, పోలీసు సిబ్బందితో డీఎస్పీ తిరుపతిరావు

ప్రస్తుతం మడికొండలోని మెట్టుగుట్ట సీతారామాంజనేయ స్వామి ఆలయానికి సంబంధించిన 240 ఎకరాల దేవాదాయశాఖ భూములు ఉన్నాయి. ఇందులో 160 ఎకరాలు రైల్వేకు ఇచ్చారు. మిగిలిన స్థలం కూడా కోచ్‌ల నిర్మాణానికి కేంద్రం సేకరించే అవకాశాలున్నాయి.

వందేభారత్ తయారీ ఇక్కడే!

- కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ కల సాకారం..
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటనతో ఆనందం
- అదనంగా రూ.66 కోట్లు మంజూరు



కాజీపేట, న్యూస్‌టుడే

ఓరుగల్లు ప్రజల చిరకాల వాంఛ నెరవేరే రోజు వచ్చింది. గత 45 ఏళ్లుగా ఎదురుచూస్తున్న కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు దిశగా కీలక ముందడుగు పడింది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లో జరిగిన ఓ సమావేశంలో కాజీపేటలో కోచ్‌లు తయారు చేస్తామని ప్రకటించడం ఆశలు రేపాయి. రైల్వే జంక్షన్ కాజీపేటలోని అయోధ్యపురం వద్ద నిర్మిస్తున్న వ్యాగన్ తయారీ కేంద్రాన్నే అప్‌గ్రేడ్ చేసి కోచ్‌లు తయారు చేయాలని కేంద్రం భావిస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎక్కువ డిమాండ్ ఉన్న వందే భారత్ రైలు కోచ్‌లు ఇక్కడ తయారు చేయాలని నిర్ణయించడం కాజీపేటకు గొప్ప మలుపు కాబోతోంది.

ఒక్కో అడుగు పడుతూ..

వరంగల్ ప్రజల నాలుగు దశాబ్దాల ఉద్యమ ఫలితమే కోచ్ ఫ్యాక్టరీ. 1980 దశకంలో కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ కోసం ఉద్యమం ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వం సైతం మంజూరు చేసింది. డీజిల్ షెడ్ పక్కనున్న స్థలాన్ని పరిశీలించారు. పంజాబ్ అల్లర్ల నేపథ్యంలో అక్కడ పరిశ్రమలు నెలకొల్పి యువతను ఆకట్టుకోవాలనే ఆలోచనతో కాజీపేటకు మంజూరైన కోచ్ ఫ్యాక్టరీని కపుర్తలాకు మార్చారు. అప్పటి నుంచి కోచ్ ఫ్యాక్టరీ కోసం ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి. 2010లో వ్యాగన్ మరమ్మతు వర్క్‌షాపు, వ్యాగన్ తయారీ కేంద్రాన్ని సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేస్తామని కేంద్రం ప్రకటించింది. అక్కడ స్థలం లేకపోవడంతో కాజీపేటకు తరలించారు. ఇక్కడా స్థల సేకరణలో ఆలస్యమైంది. చివరికి 2016లో వ్యాగన్ షెడ్ కోసం నిధులు కేటాయించారు. ఎట్టకేలకు 2023లో ప్రధాని నరేంద్ర మోదీ వ్యాగన్ రిపేర్ వర్క్‌షాపు పనులను ప్రారంభించారు. స్థానికులు దీనిపై అసంతృప్తిగా ఉండటంతో వ్యాగన్ రిపేర్ వర్క్‌షాపుతో పాటు పిరియాడికల్ ఓవరాలింగ్ కేంద్రాన్ని సైతం మంజూరు చేశారు. కోచ్ మీద ఉన్న ఆశ అలాగే ఉంది. స్థానిక రైల్వే ఐకాస ఆధ్వర్యంలో కోచ్ సాధన సమితి పేరు మీద ఆందోళన చేశారు. చివరకు దేశవ్యాప్తంగా వందేభారత్ రైలు కోచ్‌లకు డిమాండ్ ఉండటంతో వ్యాగన్ తయారీ పరిశ్రమను, పీఓహెచ్‌ను కోచ్ ఫ్యాక్టరీగా అభివృద్ధి చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.



నిర్మాణంలో భారీ షెడ్



సిద్ధంగా క్రేన్లు

అడ్డంకులు లేకుండా ఉన్న స్థలంలోనే..

కోచ్ ఫ్యాక్టరీకి మరింత స్థలం అవసరం. సేకరణకు సమయం పట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నుంచి 160 ఎకరాలను సేకరించి వ్యాగన్ పరిశ్రమను నెలకొల్పుతున్నారు. రెండు ప్రధాన షెడ్ల నిర్మాణం, కార్యాలయాల భవనాలు నిర్మిస్తున్నారు.. దీనికి అదనంగా మరో షెడ్‌ను నిర్మించడానికి రూ.66 కోట్లను కేంద్రం విడుదల చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న 160 ఎకరాల్లోనే కోచ్ ఫ్యాక్టరీని నిర్మిస్తారు. ప్రస్తుతం ఉన్న స్థలాన్ని పూర్తి సామర్థ్యం మేరకు వినియోగించుకోవాలని చూస్తున్నారు.. రాబోయే రోజుల్లో అదనపు స్థలం సేకరించి మరింత విస్తరిస్తారు.

చెన్నై ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ తరహాలో

చెన్నై పెరంబూరులో గల ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ తరహాలో ఇక్కడ నిర్మాణం చేపట్టాలని భావిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ వందే భారత్ కోచ్‌లు తయారవుతున్నాయి. దీనికి అదనంగా ఇప్పుడు కాజీపేటలో ప్రారంభం అవుతాయి.

3000 మంది సిబ్బంది..

కోచ్ ఫ్యాక్టరీకి 3000 మంది సిబ్బంది అదనంగా రానున్నారు. పీఓహెచ్, వ్యాగన్ పరిశ్రమలకు 2000 మంది అవసరం అవుతారు. రెండు పరిశ్రమలకు కలిపి మొత్తం 5000 మంది కార్మికులు వచ్చే అవకాశం ఉంది. ముందుగా వందేభారత్ రైళ్ల కోచ్‌ల తయారీపైనే దృష్టి పెడుతున్నారు. షెడ్ నిర్మాణం కాగానే తయారీ యంత్రాలను అమరుస్తారు. పెరంబూరు కోచ్ ఫ్యాక్టరీలో పనిచేసే నిపుణులను రప్పించి ఇక్కడి కార్మికులు, అధికారులకు శిక్షణ ఇస్తారు. కోచ్‌ఫ్యాక్టరీ పూర్తి స్థాయిలో పనిచేస్తే రాంపూర్, కాజీపేట ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. అనుబంధ పరిశ్రమలు వస్తాయి.



రైల్వే వ్యాగన్‌ల తయారీ కేంద్రం షెడ్



వ్యాగన్ పరిశ్రమ కార్యాలయం

అంకెల్లో వివరాలు..	
కోచ్ ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వ గతిశక్తి పథకం కింద ఏర్పాటు చేస్తోంది.	
వ్యాగన్ షెడ్ కాజీపేటలో ప్రతిపాదించిన సంవత్సరం-	2013
కేటాయించిన నిధులు	రూ.521 కోట్లు
మొదటి దశలో విడుదలైనవి	రూ.220 కోట్లు
వ్యాగన్ తయారీ కేంద్రంగా అప్‌గ్రేడ్ చేసింది:	2023
పీఓహెచ్‌గా అప్‌గ్రేడ్ అయింది:	2023
కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయ్యేది:	2025-26

పడిలేచిన కెరటం..

తపాలా సేవలు ఆదర్శం



ఒకప్పుడు ఇంటి ముందు పోస్ట్.. అన్నమాట వినపడగానే ఇంట్లో అందరి ముఖాల్లో సంతోషం వెల్లివిరిసేది. దూరాన ఉన్న బంధువుల యోగక్షేమాలను అది మోసుకొచ్చేది. మన క్షేమ సమాచారం తీసుకెళ్లేది. ఇంటింటిని పలకరించే ఆత్మీయ బంధువులా తపాలాశాఖ ఉండేది. సమాచార సాంకేతిక పరిజ్ఞానం పెరిగి అంతర్జాలం, చరవాణులు అందుబాటులోకి వచ్చాక ఉత్తర ప్రత్యుత్తరాలు కనుమరుగయ్యాయి. మనియార్డర్లు పంపేవారు లేరు. తపాలాశాఖ ప్రాభవం కోల్పోయే పరిస్థితి నుంచి మళ్లీ కోలుకుంది. వినూత్న సేవలతో ప్రజాదరణ పొందుతోంది. గురువారం జాతీయ తపాలా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.. – న్యూస్‌టుడే, శివనగర్



గ్రామస్థాయిలో పటిష్ఠ సమాచార, మానవ వనరులతో కూడిన వ్యవస్థ ఒక్క తపాలాశాఖకే సొంతం. వర్షం కురిసినా.. వరదలు పొంగినా తోకలేని పిట్ట తొంభై మైళ్లు వెళ్తుంది. అందుబాటులోకి వచ్చిన ఆధునిక సమాచార సాంకేతిక వ్యవస్థ తోడుతో తపాలా సేవలు ప్రజలకు మరింత చేరువయ్యాయి. సేవలను అందించడంలో వేగం పెరిగింది. సాధారణ సేవలతో పాటు పొదుపు, బీమా, బ్యాంకింగ్ రంగంలోనూ అడుగిడింది.

అందిస్తున్న సేవలు..

సాధారణ తపాలా సేవలతో పాటు స్పీడ్‌పోస్టు, క్యాష్ ఆన్ డెలివరీ (సీవోడీ), ఎలక్ట్రానిక్ మనీ ట్రాన్స్‌ఫర్, ఆధార్ అప్‌డేట్ (సవరణ), తిరుమల తిరుపతి దేవస్థానం దర్శనం టికెట్లు, మైస్టాంప్, వెస్టర్న్ మనీ ట్రాన్స్‌ఫర్. ● పొదుపు ఖాతాలు, రికరింగ్ డిపాజిట్లు, కిసాన్ వికాస పత్రాలు, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, సీనియర్ సిటిజన్స్ సేవింగ్ స్కీమ్, సుకన్య సమృద్ధి యోజన ఖాతా, మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ స్కీమ్, పబ్లిక్ ప్రావిడెండ్ ఫండ్, నెలవారీ ఆదాయ పథకం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్లు, 1 నుంచి 5 ఏళ్ల టైమ్ డిపాజిట్ ఖాతాలు, తపాలా బ్యాంకు, ఏటీఎం.

మీసేవ తరహాలో..

విమాన, బస్సు, రైలు టికెట్ల రిజర్వేషన్, అన్ని రకాల బీమా పథకాలు, ఇంటి, నల్లా పన్నులు, గ్యాస్ బిల్లులు, ఈఎంఐ చెల్లింపులు, ఫాస్టాగ్, ఐటీ రిటర్న్స్, సెల్‌ఫోన్ సిమ్‌కార్డు రిఛార్జి, పాన్‌కార్డు, పాస్‌పోర్టుకు దరఖాస్తులు, పీఎం ఫసల్ బీమా, పీఎం జన్ ఆరోగ్య యోజన, ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి శ్రమయోగి మన్‌ధన్ యోజన (పీఎం-ఎస్‌వైఎం), ప్రధాన మంత్రి లఘు వ్యాపారి మన్-ధన్ యోజన (పీఎం-ఎల్‌వీఎం), ప్రధానమంత్రి ఆత్మనిర్బర్ నిధి (పీఎం స్వనిధి), నేషనల్ పెన్షన్ సిస్టం, జీవన్ ప్రమాణ్ (డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్) జారీకి దరఖాస్తు, ఇ-డిస్ట్రిక్ట్ సేవలు.



వరంగల్ ప్రధాన తపాలా కార్యాలయంలో సేవలందుకుంటున్న వినియోగదారులు

వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఇలా.. వరంగల్, హనుమకొండ డివిజన్ల పరిధిలో ఐదు ప్రధాన, 90 సబ్ యూనిట్, గ్రామస్థాయిలో 679 తపాలా కార్యాలయాలు పనిచేస్తున్నాయి.

లేఖల్లోనే మాట్లాడుకునేవాళ్లం..



- రామ్మూర్తి, విశ్రాంత జైలర్, శివనగర్ (వరంగల్)

నేను 1985 నుంచి తొమ్మిదేళ్లపాటు ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా (ప్రస్తుతం వైఎస్ఆర్ జిల్లా) ప్రొద్దుటూరు సబ్ జైల్ సూపరింటెండెంట్‌గా పనిచేశాను. నా భార్య సత్యవతి వరంగల్‌లో ఉండేది. ఆమెకు నాలుగు రోజులకు ఒక లేఖ రాసేవాడిని. ఆమె యోగక్షేమాలు, పిల్లలు ఎలా చదువుతున్నారు, వారి ఆరోగ్యం ఎలా ఉందంటూ.. ఉత్తరాల ద్వారా అడిగేవాన్ని. ఆమె రాసిన ఉత్తరం చదువుతుంటే ఆమె మాట్లాడుతున్నట్లే అనుభూతి పొందేవాడిని. టెలికాం రంగం ఎంత అభివృద్ధి చెందినా భావవ్యక్తీకరణ, మనసును కదిలించడం ఉత్తరానికే దక్కుతుంది..

పథకాలపై విస్తృత ప్రచారం



తపాలా పథకాలు, సేవలపై విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రధాన గ్రామాల్లో మహిళా సంఘాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు (ఐపీపీబీ) సేవలను ఎక్కువగా ఉపయోగించుకునేలా డిజిటల్ సేవలను విస్తృతం చేశాం.

- రవికుమార్, సూపరింటెండెంట్, వరంగల్

చదువుల తల్లిగా భద్రకాళి!



రంగంపేట(వరంగల్), న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు బుధవారం వరంగల్ జిల్లాలోని భద్రకాళి అమ్మవారు సరస్వతీ మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. లలిత పంచమి పర్వదినం కావడంతో అమ్మ సన్నిధిలో పిల్లలతో అక్షరాలు దిద్దించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తికి రథసేవ నిర్వహించారు. శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య అమ్మవారిని దర్శించుకున్నారు. చదువుల తల్లిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

● 'మహాష్టమి(దుర్గాష్టమి) రోజున కోటి యోగిని గణములతో శ్రీభద్రకాళి అమ్మవారి జన్మించారు. అందుకే మహాష్టమి పర్వదినాన సద్దుల బతుకమ్మ ఆడతారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయని' ఈవో శేషుభారతి తెలిపారు.

పీహెచ్‌డీ ప్రవేశాలపై సద్దుమణగని ఆందోళన



రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి కారును అడ్డుకుంటున్న విద్యార్థులు

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ ప్రవేశాల కోసం విద్యార్థులు చేస్తున్న ఆందోళన సద్దుమణగడం లేదు. బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టిన విద్యార్థులు పీహెచ్‌డీ- 2022 కేటగిరి-2 రెండో జాబితాలో ప్రవేశాలు కల్పించాలని రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి కారుకు అడ్డంగా బైఠాయించారు. తమకు ప్రవేశాలు కల్పించే వరకు వెళ్లనిచ్చేది లేదని భీష్మించడంతో కేయూ రాణా ఎస్ఐ రాజ్‌కుమార్ తన సిబ్బందితో వచ్చి వారిని నిలువరించారు. విషయాన్ని ఇన్‌ఛార్జి ఉప కులపతి వాకాటి కరుణకు వివరించి, న్యాయం జరిగేలా చూస్తానని రిజిస్ట్రార్ హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో మంద నరేష్, రాకేష్, మనోహర్, తిరుపతి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు
(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

దేశాలు దాటి వెళ్లి.. మృతదేహమై తిరిగొచ్చి!



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: ఉగాండాలో సివిల్ ఇంజినీర్‌గా పని చేస్తున్న జనగామకు చెందిన ఇటికాల తిరుమలేశ్ తాను పని చేసే కంపెనీలోనే సెక్యూరిటీ గార్డు జరిపిన కాల్పుల్లో శుక్రవారం మృతి చెందిన విషయం విదితమే. ఈ క్రమంలో ఉగాండా నుంచి ఐదు రోజులకు బుధవారం తిరుమలేశ్ మృతదేహం జనగామ పట్టణం గిర్నిగడ్డలోని స్వగృహానికి మధ్యాహ్నం 1 గంటకు చేరుకుంది. తిరుమలేశ్ మృతదేహంతో పాటు ఆయన భార్య సునీత, కుమారుడు వరుణ్ ఉగాండా నుంచి వచ్చారు. జనగామలో ఉన్న మృతుడి తల్లి కిష్టమ్మ, సోదరుడు చిన్నా, చెల్లెలు హేమలతతో పాటు కుమార్తె అఖిల ఐదు రోజులుగా మృతదేహం కోసం నిరీక్షిస్తూ కన్నీటి పర్యంతంలో మునిగిపోయారు. 'దేశం కాని దేశం వెళ్లి... శవంగా వచ్చావా.. బిడ్డా.. నీ భార్య పిల్లలను ఆగం చేసితివా బిడ్డా..' అంటూ తల్లి కిష్టమ్మ విలపించడం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. మృతదేహాన్ని స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పట్టణ ప్రజలు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తిరుమలేశ్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని కోరారు. పిల్లల చదువుకు అవసరమైతే బాధ్యత తీసుకుంటానని హామీనిచ్చి, ఆర్థిక సాయం అందజేశారు. అంత్యక్రియలు పట్టణంలోని మార్కెట్ సమీప శ్మశాన వాటికలో సాయంత్రం 6గంటలకు ముగిసాయి.

నిరుపేద కుటుంబంపై దీర్ఘకాలిక జబ్బు పంజా

● గంటల వ్యవధిలో తల్లీకుమారుడు మృతి



తల్లి చిదురాల శోభతో సాయికిరణ్

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: వారికి ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. రెక్కాడితే కాని డొక్కాడని నిరుపేద కుటుంబం. భార్య, భర్త, ఇద్దరు కుమారులు రోజూ పనిచేసుకొని జీవించేవారు. దీర్ఘకాలిక జబ్బు బారినపడిన తల్లి, కుమారుడు ఒకేరోజు గంటల వ్యవధిలో మృతి చెందారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరు గ్రామానికి చెందిన చిదురాల లక్ష్మణ్ తాపీమేస్త్రీగా, భార్య శోభ (53) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. శోభకు రెండేళ్ల కిందట బోన్ టీబీ సోకగా.. గ్రామంలోనే మోటార్ మెకానిక్ పని చేస్తున్న చిన్న కుమారుడు సాయికిరణ్ (25) ఏడాది కిందట నోటి క్యాన్సర్‌కు గురయ్యాడు. ఉన్నంతలో ఆసుపత్రులకు తిరిగి ఖర్చు చేసుకున్నా ప్రయోజనం లేకపోయింది. మంచానికే పరిమితమైన తల్లి బుధవారం ఉదయం మృతి చెందగా.. రెండు గంటల వ్యవధిలో కుమారుడు సైతం కన్నుమూశాడు. బతుకమ్మ, శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్న వేళ ఒకే ఇంట్లో ఇద్దరి మృతి ఆ కుటుంబం, గ్రామంలో విషాదం నింపింది. అంత్యక్రియలకు కూడా డబ్బులు లేకపోవడంతో గ్రామస్థులే విరాళాలు వేసుకొని ఆ కుటుంబానికి అండగా నిలిచారు.

రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు


మాట్లాడుతున్న విజయ నిర్మల

మరిపెడ, న్యూస్‌టుడే: రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరి కాదని జిల్లా వ్యవసాయాధికారి విజయ నిర్మల అన్నారు. మరిపెడలోని ఓ వేడుకల మందిరంలో మరిపెడ వ్యవసాయ డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాల వ్యాపారులకు బుధవారం అవగాహన కార్యక్రమం ఏడీఏ విజయ్‌చంద్ర అధ్యక్షతన నిర్వహించగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. రైతులకు నష్టం కలిగిస్తే మాత్రం సహించేది లేదన్నారు. రికార్డుల నిర్వహణపై సమగ్ర అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారులు, ఎరువులు, పురుగుమందుల విక్రయదారులున్నారు.

నియామకం: మరిపెడ వ్యవసాయ డివిజన్ పరిధిలోని ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కాలం శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. డివిజన్ పరిధిలో నూతన కార్యవర్గ నియామక ప్రక్రియ బుధవారం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా రవి, ఉపాధ్యక్షులుగా రవీందర్, సహాయ కార్యదర్శిగా రవీందర్‌రెడ్డి, సభ్యులుగా సురేందర్, హరీష్ నియమితులయ్యారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

దంతాలపల్లి, న్యూస్‌టుడే: అధిక ధరలకు ఎరువులు, విత్తనాల విక్రయాలకు పాల్పడితే బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయనిర్మల చెప్పారు. దంతాలపల్లిలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. నిల్వలు, రికార్డులు తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. ఏఈవో వాహిని, ఏఈవో దీక్షిత్ తదితరులున్నారు.

మరిపెడలో ఎస్పీ ఆకస్మిక తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రాంనాథ్ కేకన్

మరిపెడ, న్యూస్‌టుడే: మరిపెడ ఠాణాను జిల్లా ఎస్పీ రాంనాథ్ కేకన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు పరిశీలించి రికార్డుల నిర్వహణ విధానం అమలుతీరుపై ఆరా తీశారు. స్టేషన్ పరిధిలో నేరస్థుల కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని అధికారులకు సూచించారు. దీర్ఘకాలికంగా కేసులు సత్వర పరిష్కారానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. సీఐ రాజ్‌కుమార్, ఎస్సైలు సతీష్, సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దేవీ నవరాత్రి ఉత్సవాలు


తొర్రూరులో సరస్వతి దేవి అవతారంలో..


పెద్దవంగర: ఉప్పర గూడెంలో..


రేపోణిలో..


గార్లలో..


బయ్యారంలో..


మానుకోటలో


కేసముద్రంలో..

దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో బుధవారం అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పలు మండపాల్లో హోమం, సరస్వతి పూజ నిర్వహించగా విద్యార్థులు పాల్గొన్నారు. ఇనుగుర్తి, నర్సింహులపేట, బయ్యారంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కురవిలో మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం మండపం వద్ద వేదపండితులు హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. - న్యూస్‌టుడే, బృందం


నర్సింహులపేటలో..

ఉద్యోగ కల నెరవేరిన వేళ..


నియామక పత్రాలు అందుకున్న మురళి-అనూష దంపతులు

తొర్రూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో మండలంలో పలు గ్రామాల్లో ఉద్యోగాల పంటపడింది. కఠోర సాధనతో పల్లెవాసుల శ్రమ ఫలించింది.. ప్రభుత్వ ఉద్యోగ కల నెరవేరింది.

ఎంపికైన దంపతులు

హరిపిరాల గ్రామంలో ఎనిమిదిమంది ఉపాధ్యాయ కొలువులు సాధించారు. వారిలో దంపతులు గుండ్ల మురళి-అనూష ఉన్నారు. భూపాలపల్లిలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అనూష ప్రస్తుతం అప్పాలో శిక్షణ పొందుతున్నారు. దంపతులు వెలువడిన ఫలితాల్లో ఎస్జీటీ ఉద్యోగాలు సాధించారు. కులాంతర వివాహం చేసుకున్న వీరు, కష్టపడి ఉద్యోగాలు సాధించి, బుధవారం హైదరాబాద్‌లో నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని గ్రామస్థులు అభినందించారు.

నిన్న కానిస్టేబుల్..నేడు టీచర్


ప్రసన్న

డోర్నకల్, న్యూస్‌టుడే: డోర్నకల్‌కు చెందిన ప్రసన్న డిగ్రీ చదివాక 2018లో కానిస్టేబుల్‌గా ఉద్యోగం పొందారు. హైదరాబాద్‌లోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తూనే బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పీజీ పూర్తి చేశారు. డీఎస్సీ రాసి 1:3లో ఎస్జీటీ అయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా బుధవారం నియామక పత్రం అందుకున్నారు. ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నారు. భర్త రాజేష్ ములుగులో ఏఆర్ కానిస్టేబుల్. కుటుంబ సభ్యులు, తోటి మిత్రుల సహకారంతో టీచర్‌నయ్యానని ప్రసన్న పేర్కొన్నారు.

ఒకేసారి రెండు కొలువులు..


పవన్‌కల్యాణ్

గార్ల, న్యూస్‌టుడే: కొత్త పోచారానికి చెందిన భూక్యా పవన్‌కల్యాణ్ డీఎస్సీ 2024లో రెండు కొలువులు సాధించి తన సత్తా చాటుకున్నారు. ఈయన తండ్రి పాపాలాల్, తల్లి లక్ష్మి, తండ్రి చౌకధరల దుకాణం నిర్వహిస్తున్నారు. తల్లిదండ్రులు, అక్క, బావ, తమ్ముడు సహకారంతోనే ఈ విజయం సాధించినట్లు తెలిపారు. 2020లో ఈయనకు కేంద్ర ప్రభుత్వంలో ఎస్ఎస్‌బీ ఉద్యోగం వచ్చింది. డీఎస్సీ 2024లో స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడుగా రెండు కొలువులు సాధించారు. స్కూల్ అసిస్టెంటుగా నియామక పత్రం అందుకున్నారు.


మానుకోటలో...


కొత్తగూడ ఎంపీడీవో కార్యాలయంలో ..


డోర్నకల్‌లో ..

ఉత్సాహంగా పూల పండగ

'చిత్తూ చిత్తుల బొమ్మ...శివుడి ముద్దుల గుమ్మ...బంగారు బొమ్మ దొరికెనమ్మో ఈ వాడలోన' అంటూ మహిళలు బుధవారం బతుకమ్మ ఆడిపాడారు. డోర్నకల్ ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ ఉద్యోగులు సందడి చేశారు. కొత్తగూడలోని ఎంపీడీవో కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. మానుకోట ఆర్టీసీ డిపోలో మహిళా ఉద్యోగులు వేడుకలు నిర్వహించారు. - న్యూస్‌టుడే, బృందం

పశుగ్రాసం దహనం

దంతాలపల్లి, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పశుగ్రాసం దహనమైన సంఘటన రామవరం గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో రైతు పగిడిపల్లి ఆనంద్ తన వ్యవసాయ భూమి వద్ద పశుగ్రాసాన్ని నిల్వ చేశారు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలిపోయినట్లు తెలిపారు. బుధవారం వ్యవసాయ పనులకు వెళ్తున్న రైతులు చూసి బాధిత రైతుకు సమాచారం అందించారు.

బహుజనుల స్ఫూర్తి ప్రదాత కాన్షీరాం

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: కాన్షీరాం స్ఫూర్తితో బహుజనులు రాజకీయాల్లో రాణించాలని బహుజన సమాజ్ పార్టీ (బసపా) రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్ కోరారు. బసపా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ఓ కళాశాలలో కాన్షీరాం వర్ధంతి సభను నిర్వహించారు. శివరాజ్ హాజరై కాన్షీరాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో బసపా జిల్లా కార్యదర్శి ఎడ్ల శ్రీను, అధ్యక్షుడు ఇస్సంపల్లి ఉపేందర్, ఇన్‌ఛార్జి ఎల్.విజయ్‌కాంత్, ఉపాధ్యక్షుడు తగరం నాగన్న, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఐతం ఉపేందర్, కోశాధికారి తప్పెట్ల చాణిక్య, డోర్నకల్ అసెంబ్లీ అధ్యక్షుడు మహేందర్, ప్రసాద్‌రావు తదితరులున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


ఐలయ్య(పాతచిత్రం)

గూడూరు, న్యూస్‌టుడే: వ్యవసాయ బావి మోటారు వద్ద ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందిన సంఘటన గూడూరు మండలం బొల్లెపల్లి గ్రామ పరిధిలోని చిన్నవడ్డెరగూడెంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు చిన్నవడ్డెరగూడెం గ్రామానికి చెందిన సంపంగి ఐలయ్య(55) తనకున్న ఎకరం వ్యవసాయ భూమిలో వరి సాగు చేశారు. పంటకు నీరు పెట్టేందుకు వ్యవసాయ బావి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైన ఐలయ్య అక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి..


నరేష్(పాతచిత్రం)

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ శివారు శనిగపురం సమీపంలో సెప్టెంబర్ 30వ తేదీ రాత్రి చిన్నగూడూరు మండలం జయ్యారం గ్రామానికి చెందిన ఎల్ది నరేష్ (34) రోడ్డు ప్రమాదంలో గాయాలై చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. రూరల్ ఎస్సై దీపికారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. నరేష్ ద్విచక్రవాహనంపై మహబూబాబాద్ నుంచి జయ్యారం వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు రహదారి వెంట ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఆయనను మహబూబాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. నరేష్ తండ్రి అబ్బయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కేసముద్రం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఆర్వోబీ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. దంతాలపల్లి మండలానికి చెందిన కనకయ్య, అతని సమీప బంధువు మౌనిక, ఆమె కూతురు రీతికలతో కలిసి ద్విచక్రవాహనంపై కేసముద్రం నుంచి దంతాలపల్లి వెళ్తున్నారు. ఆర్వోబీ సమీపంలోని మూల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టరు ట్రాలీ తగిలి కింద పడిపోయారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలు కావడంతో జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


ప్రమాదానికి గురైన కారు

దంతాలపల్లి, న్యూస్‌టుడే: కారు అదుపుతప్పి రహదారి కిందకు దూసుకెళ్లిన ఘటనలో త్రుటిలో ప్రమాదం తప్పిన సంఘటన బీరిశెట్టిగూడెం శివారులోని ఎస్సీ కాలనీ వద్ద జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. ఖమ్మం పట్టణానికి చెందిన దంపతులు కారులో తమ పిల్లలతో కలిసి వరంగల్ వైపు వెళ్తున్నారు. బీరిశెట్టిగూడెం శివారులోని హనుమాన్ ఆలయం వద్దకు చేరుకున్నాక కారులో ఉన్న చిన్నారి డ్రైవింగ్ చేస్తున్న తన తండ్రి ఒడిలోకి వెళ్లింది. దీంతో కారు ఒక్కసారిగా అదుపుతప్పి జాతీయ రహదారి నుంచి పక్కకు దూసుకెళ్లింది. పక్కనే ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొని మురుగునీటి కాలువపై నిలిపోయింది. నలుగురు క్షేమంగా బయటపడటంతో స్థానికులంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం వారు మరో కారులో ఖమ్మం వెళ్లిపోయారు.

సంక్షిప్తంగా

కేసముద్రం మార్కెట్‌కు నాలుగు రోజుల సెలవులు

కేసముద్రం, న్యూస్‌టుడే: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు ఈ నెల 10నుంచి 13 వరకు రోజులు సెలవులు ప్రకటిస్తున్నట్లు మార్కెట్ కార్యదర్శి అమరలింగేశ్వర్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు సోదరులు సెలవు రోజుల్లో మార్కెట్‌కు సరకులు తేవద్దన్నారు.

పథకాలను అమలు చేయాలని వినతి

తొర్రూరు: ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగ్యారంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఆలకుంట్ల సాయిలు డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ, పింఛను పెంపు, ధాన్యంకు బోనస్ తదితర హామీలు ఎక్కడని ప్రశ్నించారు. అమలుచేయకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. పార్టీ నాయకులు లింగాచారి, సాయిలు, దేవేందర్, యాకన్న, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభను విజయవంతం చేయండి

నెహ్రూసెంటర్: ముదిరాజ్‌ల సమస్యలతో పాటు, వారిపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా జిల్లా కేంద్రంలో త్వరలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్ కోరారు. మానుకోటలో బుధవారం జిల్లా స్థాయి నాయకుల సమావేశంలో మాట్లాడారు.

బాధ్యులను శిక్షించాలని వినతి

డోర్నకల్: మహ్మద్ ప్రవక్తని అవమానించిన వ్యక్తిని శిక్షించాలని కోరుతూ డోర్నకల్‌లో ముస్లింలు ఠాణాలో బుధవారం వినతి పత్రం అందించారు. వాజిద్, రజాలి, ఆజాం, అలీముద్దీన్, ఖాసీం తదితరులున్నారు.

గార్ల: ఉత్తర్‌ప్రదేశ్‌లో ముస్లిం ఆరాధ్య దైవమైన మహ్మద్ సల్లల్లాహు సల్లంపై స్వామీజీ నర్సింహా సరస్వతి అనుచిత వ్యాఖ్యలను గార్ల జమా మసీదు కమిటీ అధ్యక్షుడు మహ్మద్ షఫీయుద్దీన్ ఖండించారు. బుధవారం స్థానిక రక్షకభట నిలయంలో బుధవారం కమిటీ బాధ్యులు ఫిర్యాదు చేశారు. ప్రధాన కార్యదర్శి షేక్ బుడాన తదితరులున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

కేసముద్రం, న్యూస్‌టుడే: ఎరువుల డీలర్లు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని ధన్నసరి ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలోని ఎరువుల విక్రయ కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

మహబూబాబాద్, న్యూస్‌టుడే: దసరా పర్వదినం సందర్భంగా బుధవారం 27వ వార్డు కౌన్సిలర్, మాజీ ఉపాధ్యక్షుడు ఎండీ. ఫరీద్ పురపాలక సంఘం పారిశుద్ధ్య సిబ్బందికి దుస్తులను పంపిణీ చేశారు. పట్టణ ప్రజలకు మెరుగైన ఆరోగ్యాన్ని అందించే పారిశుద్ధ్య కార్మికులు దసరా పండగ సంతోషంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు.

గురువులకు వీడ్కోలు

నెల్లికుదురు: మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ఆదర్శ పాఠశాలలో 2013 నుంచి 2024 ఆగస్టు వరకు విధులు నిర్వహించి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు, ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు వీడ్కోలు పలికారు. మండల కేంద్రంలోని ఓ వేడుకల మందిరంలో బుధవారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఉపాధ్యాయులను సన్మానించారు.

అయిదడుగుల అగర్‌బత్తి



డోర్నకల్, న్యూస్‌టుడే: డోర్నకల్‌లోని జెండాల బజారు కూడలి వద్ద అయిదడుగుల అగర్‌బత్తి బుధవారం భక్తజనం మది దోచింది. దీనిని ఏలూరుకు చెందిన అంబికా దర్బార్ బత్తి సంస్థ పంపగా ఇక్కడి యాదవనగర్ దుర్గామాత మండపంలో వెలిగించారు.

సామగ్రి పంపిణీ



గంగారం: గంగారం మండలం కాటినాగారంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో సుమారు 70 పేద కుటుంబాలకు టార్పాలిన్లు, చీరలు, దుప్పట్లను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ఛైర్మన్ వరప్రసాద్, కోశాధికారి వెంకట రెడ్డి, సభ్యులు వెంకన్న, గంగారం తహసీల్దారు రాములు, డాక్టర్ ప్రత్యూష, ఏపీఎం శ్రీనివాస్, గ్రామస్థులున్నారు.

భారీ వర్షం.. కొనుగోళ్లకు అంతరాయం

తొర్రూరు, న్యూస్‌టుడే: మండలంలో బుధవారం రాత్రి భారీవర్షం కురిసింది. దీంతో డివిజన్ కేంద్రంలో పండగ కొనుగోళ్లకు అంతరాయం కలిగి, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఎస్సీ వర్గీకరణ అమలుచేయాలని నిరసన



తొర్రూరు, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు వెంకన్నమాదిగ, ఐలయ్యమాదిగలు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణను వెంటనే అమలుచేస్తామని, జాప్యం చేస్తున్నారని, దీంతో నియామకాల్లో జాప్యం జరుగుతోందని విమర్శించారు. ఆచరణలోకి తీసుకురాకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌ఛార్జి యాకమల్లుమాదిగ, నాయకులు సురేందర్, భిక్షపతి, రమేష్‌మాదిగ, ఉపేందర్‌మాదిగ, శ్రీనివాస్‌మాదిగ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దసరా వేడుకలను అడ్డుకోవడం విచారకరం

తొర్రూరు, న్యూస్‌టుడే: తొర్రూరు డివిజన్ కేంద్రంలో గత 22 ఏళ్లుగా ఉత్సవ్ కల్చరల్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా రావణవధ వేడుకలను రాజకీయరంగు పులిమి ఈ సంవత్సరం అడ్డుకోవడం సరికాదని సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పి.సోమేశ్వరరావు తెలిపారు. డివిజన్ కేంద్రంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ యేడు నిర్వహణకు గతనెల 23న దేవాదాయశాఖకు దరఖాస్తు చేసుకోగా కొంతమంతి రాజకీయ నాయకులు అనుమతి ఇవ్వకుండా అడ్డుకున్నారన్నారు. సమావేశంలో సొసైటీ ప్రతినిధులు ఐలయ్య, జైసింగ్‌నాయక్, శ్రీనివాస్‌గౌడ్, సోమేశ్వరరావు, లింగన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.